
# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## హాలివుడ్‌లో చాప్లిన్ అభ్యుదయం

*(1954 ఆగస్ట్ కినిమా పత్రిక నుంచీ పునర్ముద్రణ)*



1915 జనవరిలో చార్లీ చాప్లిన్ ఎసెనే కంపెనీలో వారానికి 310 పౌన్లు (సుమారు 4 వేల రూపాయలు) జీతం మీద ప్రవేశించాడు. మాక్ సెనెట్ కంపెనీలో అతనికి మంచి నటులుండేవారు. కాని ఇక్కడ ఆ సౌకర్యంలేదు. అందుచేత చాప్లిన్ ముందుగా కొందరు నటులనూ, టెక్నిషియనులనూ పోగుచేశాడు. (వీరిలో చాలామంది యావజ్జీవం చాప్లిన్‌తోనే వుండిపోయారు)

ఒక పార్టీలో చాప్లిన్‌కు ఎడ్నా పర్వియాన్స్ అనే పిల్ల తటస్థపడింది. ఈమె అందగత్తె. వయసు 21. ఈమె తండ్రి నెవేడాకు చెందిన గని కార్మికుడు. ఈమె షార్ట్‌హాండ్ టైపిస్టు పని చేసుకుంటున్నది. ఆమెకు స్టేజి అనుభవంగాని సినిమా అనుభవంగాని లేదు. అయినా చాప్లిన్ ఈమెను చేరదీసి తనకు అవసరమైనట్టుగా తయారు చేసుకున్నాడు. చాప్లిన్ తీసిన చిత్రాలు చాలా వాటిలో ఈమె నటించింది. వీరిద్దరూ జీవితంలోకూడా చాలా

అన్యోన్యంగా వుండేవారు. చాప్లిన్ ఆమెను వివాహం చేసుకుంటాడనికూడా అనేకమంది భావించారు. అయితే అది జరగలేదు.

1915లో చాప్లిన్ ఎసెనే కంపెనీలో పనిచేస్తూ 14 చిత్రాలు తీశాడు. వీటి నిర్మాణం గురించి అతను పూర్వం ఎన్నడూ తీసుకోని శ్రద్ధ తీసుకోవటమే కాకుండా వీటి శిల్పంలో కొత్త అంశాలు – కరుణరసం. వ్యంగ్యధోరణి, అనుకోని కథా పరిణామాలూ, అలౌకిక సంఘటనలూ, ధ్వనీ – ప్రవేశపెట్టాడు. "ఎ వుమన్" "కార్మెన్" "ది బాంక్" చిత్రాలలో ఈ అంశాలున్నాయి.

చాప్లిన్ ఎసెనే కంపెనీలో చేరిన మూడు మాసాలకు "ది ట్రాంప్" అనే చిత్రం విడుదల అయింది. దీనిని తయారు చేయటానికి మూడువారాలు పట్టింది. చాప్లిన్ తయారుచేసిన చిత్రాలలో "క్లాసిక్" (అత్యుత్తమ కళాఖండం)గా పేర్కొనదగినవాటిలో ఇది మొదటిదిగా భావించబడుతున్నది. ఇది కరుణ రసప్రధానం కావటమేగాక విషాదాంతం కూడానూ. అప్పటికి విషాదాంత చిత్రమన్నది ఎవరూ కనలేదు, వినలేదు.

ఈ చిత్రంలో "ట్రాంప్" (తిరుగుబోతు) పాత్రను చార్లీ ధరించాడు. ఇతను ఒక పిల్లను దొంగలబారినుండి రక్షిస్తాడు. దీనికి బహుమానంగా ఆమె తండ్రి అతనికి నౌకరీ ఇస్తాడు. కొన్ని రోజులు ఇతనికి ఆనందంగా గడుస్తాయి. ఇంతలో ఆ పిల్ల ప్రియుడు, అందగాడు. ఎక్కడినుండో దిగుతాడు. అంతటితో తిరుగుబోతు పగటికలలు భగ్నమవుతాయి. అతను మూట ముల్లె సర్దుకుని వెళ్ళిపోతాడు. దీర్ఘమైన బాటవెంబడి నడుచుకుంటూ దిజ్మండలంకేసి పోతూండగా చిత్రం ఫేడౌట్ అవుతుంది. తరువాత మరికొన్ని చిత్రాలనుకూడా చార్లీ ఇదేవిధంగా అంతంచేశాడు.

చాప్లిన్‌కు కరుణరసం స్వతహాగా ఇష్టంలేదు. జీవితమే విచారమయం. కాని కరుణలో సౌందర్యం ఉన్నది. ఆ సౌందర్యం కొరకే చాప్లిన్ కరుణను చిత్రాలలో ఉపయోగిస్తాడు.

1915 ఆఖరున చాప్లిన్ కోసం ఇతర కంపెనీలు పోటీ పడ్డాయి. ఈ పోటీలో ఎసెనే కంపెనీవారు చాప్లిన్‌కు లాభాలలో భాగం ఇస్తామనీ. అతనివంతు 1,25,000 పౌనులు (దాదాపు 16న్నర లక్షల రూపాయలు) తగ్గకుండా పూచీపడతామనీ అన్నారు. ఈ సమయానికి చాప్లిన్ అన్న సీడ్ చాప్లిన్ నాటకాలను మానేసి చార్లీ వ్యవహారాలు చూడసాగాడు. ఎసెనే కంపెనీ ఇస్తామన్న మొత్తానికి సిడ్ ఒప్పుకోలేదు. అందుచేత 1916 ఫిబ్రవరి 26 చార్లీ మ్యూచువల్ కంపెనీలో చేరాడు. ఈ కంపెనీలో ఇతని జీతం వారానికి 2,500 పౌనులు (32న్నర వేల రూపాయలు). ఇదికాక ఏడాది చివర 37,500 పౌనులు బోనస్, చాప్లిన్ సాలు సరిసంపాదన 1,67,500 పౌనులు (దాదాపు 22 లక్షల రుపాయలు)

మరోసారి చార్లీ జీతం పదింతలు పెరిగింది. అతని వయస్సు అప్పటికి 26ఏళ్ళు. మూడేళ్ళ క్రితం సినిమా ప్రపంచంలో అతనిపేరు విన్నవారు లేరు. అదీ జాతకమంటే.

ఈ కాంట్రాక్టుమీద సంతకం పెట్టి చాప్లిన్, "ఇంతకంటే ఎక్కువ లేకపోతే పోనీ. ఇదైనా ఇస్తున్నారు. ఇప్పుడే వెళ్ళి డజను నెక్ టైలన్నా కొనుక్కుంటాను" అన్నాడు.

చిత్రమేమంటే ఇంత డబ్బు వచ్చినా చాప్లిన్ మనస్తత్వంలోగాని అతని నటనలోగాని దాదాపు మార్పేమీ కలగలేదు. ఎప్పటిలాగే షోకిలా దుస్తులు ధరించాడు. లాస్ఏంజలెస్‌లోని స్ప్రింగ్ స్ట్రీట్‌తో ఉన్న స్టావెల్ హోటల్ గదిలోనే ఉంటూ వచ్చాడు. సెట్టుమీద ఉన్నప్పుడు తప్ప మనుషులను తప్పించుకు తిరిగేవాడు, సినిమాకారులు చేరే చోట్లు వర్జించేవాడు. రాత్రిళ్ళు పేదపేటలు కలయతిరిగేవాడు.

చివరకు ఇతరుల ప్రోద్బలం మీద చాప్లిన్ లాస్ ఏంజెలెస్ ఎథ్లెటిక్ క్లబ్బుకు బస మార్చాడు. అన్న ప్రోద్బలం మీద ఒక కారు కొని, టాంహోరింగ్టన్ అనే సెక్రటరీని పెట్టుకున్నాడు. ఈ కోనో అనే 18 సంవత్సరాలపాటు చాప్లిన్ వెంటే ఉండి, చాప్లిన్‌కు డ్రైవరుగా, అంగరక్షకుడుగా, సెక్రెటరీగా, నౌకరుగా పనిచేశాడు. పాలెట్ గొడ్డ చార్లీని పెళ్ళాడి, కోనోకు ఉద్వాసన చెప్పి అతని స్థానం తానే ఆక్రమించుకున్నది.

1916, 1917 సంవత్సరాలలో ఛాప్లిన్ కళ ఇంకా పరిణామం చెందింది. 18 నెలల కాలంలో అతను మూచువల్ కంపెనీ తరపున 12 హాస్య చిత్రాలు చచ్చులేనివి తయారుచేశాడు.

చిత్రం కోసం కొత్త "ఐడియా"లు ఆలోచించేటప్పుడు చాప్లిన్ చాలా కంగారులో ఉండేవాడు. తన శక్తులు చల్లారిపోయాయని అతనికి భయం కలిగేది. "నా పని అయిపోయింది" అనుకునేవాడు. కాని "ఐడియా" రానే వచ్చేది. మూచువల్ కంపెనీలో చేరగానే చాప్లిన్‌కు ఇలాటి అనుభవం కలిగింది. స్టూడియో పని ప్రారంభించటానికి సిద్ధంగా ఉంది. నటులు అంతకన్నా ఆత్రంగా ఉన్నారు. కాని చాప్లిన్ బుర్రలో "ఐడియా" లేదు. ఎన్నో రోజులు గడిచాయి. కాని చాప్లిన్ బుర్రలో ఏమీ కదలికలేదు.

న్యూయార్కులోని డిపార్ట్‌మెంట్ స్టోర్ ఎస్కలేటర్ (కదిలేమెట్లు) మీద జారిపడిన మనిషిని చాప్లిన్ చూశాడు. బుర్ర వెంటనే కదిలింది. చాప్లిన్ హాలీవుడ్‌కు తిరిగి వచ్చి డిపార్ట్‌మెంట్ స్టోర్ సెట్టు వెయ్యమని చెప్పాడు. త్వరలోనే "ఫ్లోర్ వాకర్" అనే చిత్రం తయారయింది. దీని తరువాత "ది రింగ్", "ది ఇమిగ్రెంట్", మొదలైన చిత్రాలలో చాప్లిన్ తన పనితనం క్రమంగా అభివృద్ధి చేసుకోసాగాడు.

చాప్లిన్ ఈ చిత్రాలు చేస్తున్న కాలంలో ప్రపంచ విఖ్యాతి గల పురుషులెందరో చాప్లిన్‌ను చూడవచ్చారు. మేధావులు సహితం చాప్లిన్ కళను కీర్తిస్తూ రాయసాగారు. అతని కీర్తి ప్రపంచమంతటా ఏ విధంగా పాకిందీ తెలపటానికి ఒక సంఘటన చెబుతారు.

1916లో నిజిన్‌స్కీ బాలే బృందం లాస్‌ఏంజెలిస్‌కు వెళ్ళింది. వారి ప్రదర్శనం చూడటానికి చాప్లిన్ కూడా వెళ్ళాడు. ప్రేక్షకులలో చాప్లిన్‌ను పసికట్టగానే నృత్యం చేసేవారు ప్రదర్శన మానేసి చాప్లిన్‌ను తెరవెనక్కు పిలిపించుకున్నారు. ప్రేక్షకులు అరగంటదాకా ప్రదర్శనకోసం వేచి ఉండవలసి వచ్చింది.

చాప్లిన్ కంట్రాక్టు గడువు తీరాక మూచువల్ కంపెనీ వారు చాప్లిన్‌ను మరి 12 చిత్రాలు తీసిపెట్టమనీ, అందుకుగాను 10 లక్షల డాలర్లు (25 లక్షల రూపాయలు) ఇస్తామనీ అన్నారు. చాప్లిన్‌కు ఖర్చులతో సంబంధం లేదు.

చాప్లిన్ దీనికి ఒప్పుకోక ఇంతకన్నా ఆర్ధికంగా తక్కువగా భావించదగిన ఎగ్రిమెంట్ చేశాడు. ఫస్ట్ నేషనల్ సర్క్యూట్ అనే సంస్థ ఒకటి కొత్తగా ఏర్పాటయింది. ఈ సంస్థవారు చాప్లిన్‌కు పది లక్షల డాలర్లు కాంట్రాక్టు ఇచ్చారు .కాని ఇదంతా అతని జీతం కాదు. ఈ కాంట్రాక్టు కింద తనకు స్వేచ్ఛ హెచ్చుగా ఉండటంచేత చాప్లిన్ దీనిపై సంతకం చేశాడు.

ఈ కాంట్రాక్టు ప్రకారం స్టూడియో చాప్లిన్ సొంతం, అతనే నిర్మాతకూడా. 18 నెలల కాలంలోఅతను 8 చిత్రాలు తీసేటట్టూ, ఇందుకుగాను అతనికి 253,750 పౌనులు ముట్టేటట్టూ ఏర్పాటు జరిగింది.

హాలీవుడ్‌లో లాబ్రియా ఎవెన్యూ, సన్సెట్ బూల్వార్డ్‌లు కలిసేచోట అయిదెకరాల స్థలాన్ని చాప్లిన్ సోదరులు స్టూడియో నిమిత్తమై కొన్నారు. 1917 అక్టోబరులో దాని ఖరీదు 8,500 పౌనులు: ఇవాళ 40 రెట్లుంటుంది. ఆనాడది హాలీవుడ్‌కు ఒక చివరవుండేది, ఇప్పుడది హాలీవుడ్ స్టూడియోల నట్టనడాన వున్నది. 1918 నుంచీ చాప్లిన్ ఇంతవరకు తీసిన చిత్రాలన్నీ ఇక్కడే తీయబడ్డాయి.

ఇంతలో మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికా ప్రవేశించింది. చాప్లిన్‌ను యుద్ధంలో చేరమంటూ అంతులేని ఉత్తరాలు చాలాభాగం తిట్లతో సహా వచ్చాయి. నిజానికి చాప్లిన్ సైనికుడుగా పనికిరాడు. అతని ఎత్తు 5 అడుగుల 4 అంగుళాలు, అప్పుడు అతని తూకం 100 పౌనులకు లోపు. అయినా తిడుతూ ఉత్తరాలు రాసే వారికిది అంతగా పట్టలేదు. అతను అంతులేని డబ్బూ, కీర్తీ గడించటం వల్ల అసంఖ్యాకులకు కలిగిన కడుపుమంటే దీనికి కారణం.

కొత్త కంపెనీకి కొద్ది ఫిలిములు తయారుచేసిన అనంతరం చాప్లిన్ యుద్ధ రుణపత్రాల అమ్మక ప్రచారంకోసం రెండుమాసాలు పర్యటించాడు. ఇతని వెంట డగ్లస్‌ఫేర్ బ్యాంక్స్, మేరీ పిక్‌ఫోర్డ్ (భార్యా భర్తలూ, సినిమా తారలు)కూడా పర్యటించారు. వెళ్ళినచోటనల్లా డగ్లస్‌ఫేర్ బ్యాంక్స్ – చాలా బలశాలి – చాప్లిన్‌ను భుజాలమీదికి ఎత్తుకుని ప్రేక్షకులకు ప్రదర్శించేవాడు. అమెరికా అధ్యక్షుడు విల్సన్ వైట్ హౌస్‌లో చాప్లిన్‌కు స్వాగతమిచ్చాడు. వాషింగ్టన్ నగరంలో 65వేలమంది ప్రేక్షకుల ఎదుట చాప్లిన్, మేరీ డ్రెస్లర్‌తో నృత్యం చేశాడు. అప్పటికప్పుడే యుద్ధ బాండ్లు చురుకుగా అమ్ముడుపోయాయి.

ఈ సందర్భంలో చాప్లిన్ దక్షిణ రాష్ట్రాలను ఒంటరిగా పర్యటించాడు. ఇతని ప్రయత్నంవల్ల డిక్సీలో బాండ్లు బాగా అమ్ముడయ్యాఇ. న్యూ ఆర్లియన్స్‌కు చాప్లిన్ వెళ్ళినప్పుడే అక్కడికి మాజీ ఆర్ధిక మంత్రి ఒకాయన, బాండ్ల అమ్మకం

ప్రోత్సహించే పనిమీదనే వెల్ళాడు. "ఒక క్షుద్ర సినిమా నటుడి" పేరుతో తన పేరును జతచేయనివ్వటానికి ఈ రాజకీయవేత్త ఆమోదించకపోవటంవల్ల ఆయనా, చాప్లిన్ వేరు వేరు సమావేశాలలో ప్రసంగించటానికి అధికారులు ఏర్పాటు చేశారు. ఫలితం" రాజకీయవేత్త ప్రసంగం వినటానికి 400మంది వచ్చారు. చాప్లిన్ మీటింగుకు 40,000 మాత్రమే వచ్చారు.

Post your comments